సిరిమానుపై ఇలవేల్పు వైభోగం

అశేష జనవాహిని.. వేలాది ఘటాలు .. మేళతాళాలు.. వేదపండితుల మంత్రోచ్చరణలు.. పులి వేషాలు.. విచిత్ర వేషధారణల నడుమ సిరుల తల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరం పైడితల్లి సిరిమాను సంబరం మంగళవారం కనుల పండువగా సాగింది. ఆద్యంతం అంబరాన్నంటేలా ఉత్సవం జరిగింది. తల్లి ప్రతిరూపంగా ఉన్న సిరిమాను పూజారిని భక్తులు మనసారా మొక్కి పునీతులయ్యారు.

– ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, కంటోన్మెంట్, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, రింగురోడ్డు, కోట


కోటపై నుంచి వీక్షిస్తున్న అశోక్, సంధ్యారాణి, ఎమ్మెల్యేలు


పైడిమాంబ పండగలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవంలో భాగంగా వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు దర్శనానికి బారులుదీరారు. తొలుత హుకుంపేటలోని సిరిమానును దర్శించి.. అనంతరం చదురుగుడికి వచ్చారు. లక్షలాది మందితో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. మధ్యాహ్నం పూజారి బంటుపల్లి వెంకటరావు తల్లి ప్రతిరూపంగా సిరిమానును అధిరోహించారు.


పుష్పాలంకరణలో అమ్మవారు



త్వరగా ముగిసిన సంబరం

దాదాపు పుష్కర కాలం తర్వాత చీకటి పడక ముందే సాయంత్రం 5.30 గంటల్లోగా ఉత్సవాన్ని అధికారులు ముగించారు. రెవెన్యూ, దేవదాయ, పోలీసు శాఖల సమన్వయంతో త్వరగా పూర్తి చేయగలిగారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. ఊరేగింపులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్ నేరుగా పాల్గొని.. సమయానికి రథాలను నడిపించారు.


దర్శనానికి బారులుదీరిన భక్తులు


అశోక్, అదితికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పండితులు


ఊరేగింపులో పాల్గొన్న అశేష జనవాహిని

పట్టు వస్త్రాల సమర్పణ: రాష్ట్ర పండగ కావడంతో ప్రభుత్వం తరఫున జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు పూసపాటి వంశీయులు, దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. సిరిమాను వెనుక తల్లి సైనిక శక్తిగా పిలిచే పాలధార పయనమైంది. దానిని అనుసరిస్తూ విజయనగర ప్రాభవాన్ని ప్రతిబింబించేలా ఏనుగు రథం కదిలింది. పరిచారికలు, పైడిమాంబ మధ్య అనుబంధానికి గుర్తుగా అంజలి రథం, బేస్తవారి వల బయలుదేరాయి.


ఘటంతో యువతి

హాజరైన ప్రముఖులు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, అదనపు జిల్లా న్యాయమూర్తులు పద్మావతి, నాగమణి, టి.వి.రాజేష్ కుమార్, శాశ్వత లోక్ అదాలత్ జడ్జి దుర్గయ్య, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ దంపతులు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణంరాజు, బేబినాయన, జయకృష్ణ, లోకం నాగమాధవి, కోళ్ల లలితకుమారి, బోనెల విజయచంద్ర, పార్వతీపురం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్, పండగ ప్రత్యేక అధికారి వి.త్రినాథనావు, ఈవో డీవీవీ.ప్రసాద్, ఆర్డీవో దాట్ల కీర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య పాల్గొన్నారు.


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొండపల్లి దంపతులు, ఎంపీ కలిశెట్టి


సిరిమానుకు నమస్కరిస్తున్న బొత్స దంపతులు


అమ్మవారి ఘటాలకు మొక్కులు

ఉలిక్కిపడ్డ గుర్ల

★ వాంతులు, విరేచనాలతో..
★ ఒకేరోజు నలుగురి మృతి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

విజయనగరం–ఈనాడు, గుర్ల/గరివిడి, న్యూస్‌టుడే: గుర్ల ఉలిక్కిపడింది. గ్రామంలో మూడు రోజులుగా పలువురు విరేచనాలు, వాంతులతో బాధపడుతున్నారు. వారిలో రెండు రోజుల కిందట ఒకరు మృతి చెందగా.. మంగళవారం నలుగురు మరణించడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వీరిలో తోంద్రంకి రామయ్యమ్మ (60) ఇంటి వద్ద మరణించారు. సారిక పెంటయ్య (65) పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రాణాలు విడిచారు. జి.పైడమ్మ (50) విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, కలిశెట్టి సీతమ్మను (45) చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా చనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. 27 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో వాళ్లె అప్పలనాయుడు, వాళ్లె రమేష్, మొయిద అప్పయ్యమ్మ నెల్లిమర్ల సామాజిక ఆసుపత్రిలో, చందక భాస్కరరావుతో పాటు మరికొందరు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉన్నారు. వారిలో చిన్న పిల్లలు కూడా ఉన్నారు. రెండు రోజుల పాటు ప్రజలకు వైద్య సేవలు అందించిన ఆశా కార్యకర్త రాజేశ్వరి కూడా చికిత్స తీసుకుంటున్నారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు పరిస్థితిని పరిశీలించి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నామని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నయ్ తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైన రోగులను విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలిస్తున్నామని చెప్పారు. మృతులకు అతిసారంతో పాటు గుండె, కిడ్నీ, బీపీ, సుగర్ వంటి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు చెప్పారు.

కలుషిత నీరే కారణమవ్వొచ్చు

చంపావతిలో నీటి ప్రవాహం నిలిచిపోవడం.. పక్షం క్రితం ఎగువ ప్రాంతం నుంచి జంతు కళేబరాలు కొట్టుకురావడంతో నీరు కలుషితమైంది.. అది తాగడం వల్ల డయేరియా సోకిందని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు, అధికారులతో మాట్లాడి కారణాలపై ఆరా తీశారు. వీఆర్వో ద్వారా మృతుల కుటుంబాల వివరాలను కలెక్టర్‌కు నివేదించాలని తహసీల్దారును ఆదేశించామన్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు.


వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

అంతుచిక్కని కారణాలు

మరణాలకు అసలు కారణాలేమిటన్నవి అధికార యంత్రాంగం ఇంత వరకు తేల్చలేదు. గ్రామంలో పారిశుద్ధ్య లోపం, మురుగు కాలువల్లో తాగునీటి కుళాయిలు, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడం వంటివి ఈ పరిస్థితికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాస్తవ కారణాలు నిగ్గు తేల్చి.. అదుపులోకి తీసుకురావాలని కోరుతున్నారు. వ్యాధి ప్రబలడానికి కారణాలేమిటన్నవి పూర్తి నివేదిక వస్తేనే తెలుస్తుందని, మరణించిన వారంతా అతిసారం మూలంగానే చనిపోయారా? ఇతరత్రా అనారోగ్య సమస్యలు కారణమా అన్నది తేలాల్సి ఉందని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.

అమ్మ పండగ.. ఆనందం మెండుగా

• భక్తులతో కిక్కిరిసిన నగరం


పైడిమాంబ దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు




కుటుంబ సభ్యులతో దర్శనానికి వెళుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి


ఉత్సవాన్ని తిలకించేందుకు కోట పైకి వెళుతున్న అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే నాగమాధవి తదితరులు


నమస్కరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి


కోట సమీపంలో సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం




రఘురామ కృష్ణం రాజు


బేబినాయన

పైడితల్లి జాతర నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి నగరం కిక్కిరిసింది. పోలీసులు అధికారికంగా ఎనిమిది ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. వివిధ చోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. భక్తులు కాలినడకనే తల్లి దర్శనానికి వెళ్లారు. వీరికి యంత్రాంగంతో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవలు అందించారు.

- న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, కంటోన్మెంట్, కోట, రింగురోడ్డు


సినీనటుడు సుహాస్, హీరోయిన్ సంగీర్తన

విత్తనాల అందజేత..

సోమవారం అర్ధరాత్రి తరువాత దేవస్థానం అధికారులు, హుకుంపేట వాసులు, తలయారీలు చదురుగుడి నుంచి కోట వరకు ఘటాలతో వెళ్లారు. అక్కడ కోటదుర్గకు మొక్కి.. జిల్లా, రాష్ట్రం, దేశం బాగుండాలని పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి చదురుగుడికి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు రైతులకు విత్తనాలు అందజేశారు. ఇదే తొలేళ్ల ఉత్సవంలో ప్రధాన ఘట్టం.




భక్తుల సందడి


ఊరేగింపులో పాల్గొన్న కలెక్టర్లు అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో దాట్ల కీర్తి తదితరులు

ఉత్సవాలు విజయవంతం: కలెక్టర్

విజయనగర ఉత్సవాలు, అమ్మవారి సిరిమానోత్సవం విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అనుకున్న సమయానికే ఊరేగింపు పూర్తి చేయగలిగామన్నారు. నిర్వహణ కోసం సుమారు నెలరోజులుగా సమావేశాలు నిర్వహించి, వివిధ వర్గాలతో చర్చించామన్నారు. 12 వేదికల్లో నిర్వహించిన సాంస్కృతిక, సాహిత్య, వినోద కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయని చెప్పారు. సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.


బందోబస్తును పరిశీలిస్తున్న ఐజీ ప్రతాప్, ఎస్పీ తదితరులు


సిరిమాను పూజారితో దేవదాయ అధికారులు


మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు అదితి, విజయచంద్ర



రథాలే ఆకర్షణ

సిరిమాను ముందు కదులుతున్న అంజలి రథం, బెస్తవార వల, ఏనుగు రథం, పాలధార









చెరువులో పడి దర్జీ మృతి

పార్వతీపురం గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: చెరువులో పడి ఓ వృద్ధుడు మృత్యువాత పడిన ఘటన పార్వతీపురం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై దినకర్ వివరాల మేరకు.. అడ్డాపుశీల గ్రామానికి చెందిన బి.వెంకటరమణ(68) టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు స్థానికంగా ఉన్న చెరువుకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ అందులో పడి మృతి చెందారు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలియజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వెంకటరమణ (పాతచిత్రం)

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



డి.శ్రీను (పాతచిత్రం)

తగరపువలస (విశాఖపట్నం), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ కాపలాదారు మృతి చెందినట్లు భీమిలి ఎస్సై హరీశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కాటూరుపల్లికి చెందిన డి.శ్రీను(40) భీమిలి అప్పికొండవీధిలోని ఓ అపార్ట్‌మెంటులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. దసరా నేపథ్యంలో భార్య రమణమ్మ, కుమారులు దీపక్, సందీప్, తండ్రి సూరితో కలిసి ఈనెల 13న విజయవాడ కనకదుర్గ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో 14వ తేదీ రాత్రి తగరపువలసలోని గోస్తనీ కూడలి వద్ద బస్సు దిగారు. కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వైపు వేగంగా వెళుతున్న ఓ కారు శ్రీనును ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్ల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గుర్ల మండలం అచ్యుతాపురం వద్ద చోటు చేసుకుంది. ఏఎస్సై మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరానికి చెందిన ఆర్.రాజు (40) సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై గరివిడి నుంచి విజయనగరం వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో రాజు ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. మంగళవారం శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో 15 ఎకరాల చెరకు తోట దగ్ధం

రేగిడి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో 15 ఎకరాల మేర చెరకు తోటలు దగ్ధమైన ఘటన మంగళవారం రేగిడి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైతు దేవకోటి భాస్కరరావు పొలం గుండా విద్యుత్తు తీగలు వెళుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. చెరకు తోటలకు అంటుకోవడంతో పెద్దఎత్తున విస్తరించాయి. ఎస్.జగన్నాథంనాయుడు, ఎ.మల్లయ్య, కె.భాస్కరరావు, డి.భాస్కరరావు, డి.వెంకటరమణ, డి.శ్రీను, ఎల్.రఘురాం, ఆర్.గోవిందరావు, ఎల్.విష్ణు, కె.గోవింద, కె.అప్పలనాయుడు తదితర రైతులకు చెందిన తోటలు కాలిపోయాయి. పాలకొండ అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.13.50 లక్షల నష్టం జరిగినట్లు అంచనా వేశారు. రెవెన్యూ, విద్యుత్తు శాఖ అధికారులు ఘటనాస్థలిని పరిశీలించారు. కర్మాగారం అధికారులు వివరాలు సేకరించారు. బాధితులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోండ్రు దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని కోరారు.



చోరీ కేసులో ఏడాది జైలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ రైతు అప్పు తీరుద్దామని బ్యాంకు నుంచి నగదు డ్రా చేసి ఇంటికి తిరిగి వస్తుండగా ఆ సొమ్ము కాజేశాడు ఓ వ్యక్తి. సదరు నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ కృష్ణా జిల్లా గన్నవరం 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గన్నవరం మండలం గోపవరపుగూడెంకు చెందిన ఎం.వెంకటసుబ్బారావు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. గతంలో తీసుకున్న అప్పు తీరుద్దామని విశాఖకు చెందిన ఓ మిత్రుడి వద్ద రూ.3 లక్షల నగదు అడగగా అతడు బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. గన్నవరంలోని బ్యాంకుకు వెళ్లి డ్రా చేసి ద్విచక్ర వాహనానికి పక్కన ఉన్న పెట్టెలో భద్రపరిచి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో ఓ ఎరువుల దుకాణం వద్ద కాసేపు ఆగి వెంటనే ఇంటికి బయలుదేరారు. వెనుక వైపు నుంచి పెట్టె శబ్దం రాగా.. గ్రామ శివారుకు చేరుకొనే సమయంలో ఆగి చూశారు. అప్పటికే నగదు మాయమైంది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిగా విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఎం.తిరుపతిగా గుర్తించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వచ్చినట్లు పోలీసులు, ఏపీపీ టి.మాధవి తెలిపారు.

పోక్సో కేసు నిందితుడి పరారీ?

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు పోలీసుల కళ్లు కప్పి పరారైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పార్వతీపురం పట్టణంలో చదువుతోంది. సదరు విద్యార్థినికి మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు గ్రామీణ స్టేషన్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా బాలికకు జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. విచారణకు స్టేషన్‌కు తీసుకురాగా అక్కడి నుంచి మంగళవారం పరారైనట్లు తెలుస్తోంది. అతడి కోసం కొందరు సిబ్బంది గాలిస్తున్నట్లు సమాచారం. దీనిపై గ్రామీణ ఎస్సై దినకర్ వద్ద ప్రస్తావించగా.. ఓ యువకుడిని ఠాణాకు తీసుకొచ్చామని, ఇంటికి వెళ్లి వస్తానని చెప్పాడని తెలిపారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.55 కోట్లు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మహిళల స్వయం ఉపాధికి అనుగుణంగా యూనిట్ల ఏర్పాటుకు రూ.55 కోట్లు స్త్రీనిధి రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా సహాయ జనరల్ మేనేజర్ హేమలత తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశమయ్యారు. మొత్తం 11 వేల మంది సభ్యులకు రుణాలు ఇస్తామన్నారు. ఇప్పటివరకు 4 వేల మందికి రూ.23 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఏపీఎం ఆదయ్య, సీసీలు ఉన్నారు.


సూచనలు చేస్తున్న ఏజీఎం

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264

మద్యం విధానంపై మాట్లాడే హక్కు వైకాపాకు లేదు: కళా


మాట్లాడుతున్న వెంకటరావు, చిత్రంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి, న్యూస్‌టుడే: మద్యం విధానంపై మాట్లాడే హక్కు వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నేతలకు లేదని ఎమ్మెల్యే కళా వెంకటరావు మండిపడ్డారు. మంగళవారం బొబ్బిలిలో తెదేపా సీనియర్ నేత అల్లాడ భాస్కరరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పిరిట్ తయారీ కర్మాగారాలను జగన్ స్వాధీనం చేసుకుని.. పంపిణీదారులుగా ప్రభుత్వం వ్యవహరించడంతో ఇష్టారాజ్యంగా మద్యం వ్యాపారం సాగించారని విమర్శించారు. జే బ్రాండ్ మద్యంతో ప్రజల ఆరోగ్యాలను పాడుచేశారని ఆరోపించారు. విశాఖలో ప్రత్యేకంగా మానసిక రోగులు ఆసుపత్రి ఉండగా.. కేజీహెచ్‌లో కూడా మరో వార్డును ఏర్పాటు చేశారంటే అయిదేళ్లు సరఫరా చేసిన మద్యం ఎలా ఉందో తెలుస్తోందన్నారు. 500 దుకాణాలకు దరఖాస్తులు పెట్టుకున్న వారికి ఒక్కటి కూడా దక్కలేదంటే లాటరీ ఎంత పారదర్శకంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. వర్షాకాలం వల్ల కొన్ని రేవుల్లో ఇసుక తవ్వకాలు జరగడం లేదని, పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నేతలను కళాకు బేబినాయన పరిచయం చేశారు.

అంతర్జాతీయ పోటీల్లో పైడిరాజుకు కాంస్యం



సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్యం పతకం సాధించింది. మలేసియాలో జరిగిన 800 మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచినట్లు మామిడిపల్లి ఉన్నత పాఠశాల పీడీ శ్రీరాములు మంగళవారం తెలిపారు. గతంలో ఆమె శ్రీలంకలో జరిగిన పోటీల్లో రజతం దక్కించుకుందని చెప్పారు. మరోసారి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడంతో గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? శ్రీహరినాయుడుపేట- ఎస్సార్ అగ్రహారం గ్రామాల మధ్య రహదారి లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. **- ఎస్సార్ అగ్రహారం గ్రామస్థులు**

● రెండు గ్రామాల మధ్య ప్రస్తుతం మట్టి దారి ఉంది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- రియాజ్, ఏఈ పంచాయతీరాజ్ శాఖ
– న్యూస్‌టుడే, సంతకవిటి

? ఉంగరాడమెట్ట- వన్నలి రహదారిలోని బద్దెగెడ్డ వంతెన వద్ద ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది.
- ఎస్.శ్రీరాంమూర్తి, యూఎన్ వలస

● పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటాం.
- నాగభూషణరావు ఏఈ ఆర్అండ్‌బీ
– న్యూస్‌టుడే, రేగిడి

? చీపురుపల్లిలోని శ్రీకాకుళం ప్రధాన రహదారిలో సెంటర్ లైటింగ్ స్తంభాలకు కొన్ని వీధి దీపాలు కొద్ది రోజులుగా వెలగడంలేదు. **- స్థానికులు**

● వీధి దీపాలు వెలిగించేందుకు చర్యలు చేపడతాం.
- ఝాన్సీరాణి, ఈవో, మేజర్ పంచాయతీ
– న్యూస్‌టుడే, చీపురుపల్లి

? రుషింగి గ్రామంలో పూడు చెరువు గట్టుపై ఉన్న రహదారి పాడైంది. బాగుచేయాలి. **- స్థానికులు**



● పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి.. రహదారి బాగుకు చర్యలు తీసుకుంటాం.
- త్రినాధరావు, ఎంపీడీవో – న్యూస్‌టుడే, వంగర

పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

చీపురుపల్లి: చీపురుపల్లిలోని శివరాం రహదారికి ఆనుకుని పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 15న 'ఈనాడు'లో 'ఇలాగైతే రోగాలు రావా?' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మేజర్ పంచాయతీ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు.

క్రీడాకారులకు అభినందనలు

గంట్యాడ, గ్రామీణం: అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో విజయనగరం బాలికలు, బాలుర జట్లు మంచి ప్రదర్శన కనబర్చాయని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు అవనాపు విజయ్, కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు నూజివీడులో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన మహిళలు, ద్వితీయస్థానంలో నిలిచిన పురుషులను వీరు అభినందించారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

అవగాహన ర్యాలీ

రామభద్రపురం, బాడంగి, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు రామభద్రపురం, బాడంగి జడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, దత్తి సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, కళావతి తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురంలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పల్లె పండగ.. ప్రగతి నిండుగా

న్యూస్‌టుడే, గరివిడి, సంతకవిటి, చీపురుపల్లి గ్రామీణం

అయిదేళ్లు నిర్లక్ష్యానికి గురైన పల్లెలకు మహర్దశ కలగనుంది. ప్రభుత్వం వారం రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన 'పల్లెపండగ' కార్యక్రమం ఈనెల 14న ప్రారంభమైంది. గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల పరిధిలోని పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపనలు చేస్తున్నారు. గ్రామస్థులు సైతం పాల్గొంటున్నారు. సీసీ రోడ్లు, కాలువలు తదితర పనులు పెద్ద ఎత్తున చేపడుతుండడంతో పల్లెల రూపురేఖలు మారనున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సిమెంటు రహదారి సదుపాయం కలగనున్న చీపురుపల్లి మెట్టకాలనీలోని ఒక వీధి



ఎస్సార్ అగ్రహారంలో అధ్వానంగా ఉన్న ఓ వీధి రోడ్డు

సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా..

వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాలు ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదు. ప్రధానంగా రహదారులు అధ్వానంగా తయారవ్వడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. వీధి రోడ్లు, కాలువల వంటి నిర్మాణాలేవీ జరగక నానా అవస్థలు పడ్డారు. సర్పంచులుగా ఎన్నికైన వారంతా తమ గ్రామాలకు ఏమీ చేయలేకపోతున్నామనే ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుపై దృష్టి పెట్టింది. గ్రామసభల్లో గుర్తించిన పనులను పల్లె పండగ కార్యక్రమం ద్వారా ప్రారంభిస్తున్నారు. సంక్రాంతి నాటికి అన్ని పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు.

పనుల వివరాలు..

మండలం	పనుల సంఖ్య	నిధులు (రూ.లక్షల్లో)
చీపురుపల్లి	86	427.33
గరివిడి	59	317.90
గుర్ల	47	339.50
మెరకముడిదాం	71	529.98
రాజాం	94	567.13
రేగిడి	130	651.10
సంతకవిటి	131	560.00
వంగర	48	352.95

సకాలంలో చేయడానికి చర్యలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లెపండగలో ప్రారంభించిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. నాణ్యతలో రాజీపడకుండా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తాం.
– టీవీ రమణమూర్తి, డీఈఈ, పంచాయతీ రాజ్ సబ్ డివిజన్, చీపురుపల్లి

కార్యాచరణ సిద్ధం..

ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఇప్పటికే పంచాయతీ అధికారులకు ఆదేశాలు అందాయి. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని మండలస్థాయి అధికారులకు సూచించారు.
– కె.సురేష్‌కుమార్, ఎంపీడీవో, సంతకవిటి

ఖోఖో పోటీలకు ఎంపిక

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం తోండ్రంగి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్.హారిక అండర్ - 14, ఆర్.జాహ్నవి అండర్ - 18 విభాగంలో జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. ఇటీవల బాపట్ల జిల్లా జె.పంగులూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రమేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఈ నెల 18 నుంచి జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఇద్దరూ పాల్గొంటారని చెప్పారు.



హారిక



జాహ్నవి

లోపాలు తెలియజేయాలి

గజపతినగరం, న్యూస్‌టుడే: ఈ పంట నమోదులో లోపాలు ఉంటే రైతు సేవా కేంద్రంలో తెలియజేసి సరి చేసుకోవాలని ఏడీఏ కె.మహరాజన్ సూచించారు. మంగళవారం గంగచోళ్లపెంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పొలాలను సందర్శించారు. ఏవో ధనలక్ష్మి, సర్పంచి సంగమయ్య, ఎంపీటీసీ సభ్యుడు కె.చినపైడన్న తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ మహరాజన్

మండలస్థాయి యోగా పోటీలు



ఆసనాలు వేస్తున్న చిన్నారులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని శ్రీనిధి పాఠశాలలో మంగళవారం మండలస్థాయి యోగా పోటీలను మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు ప్రారంభించారు. పోటీల నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివన్నాయుడు, పీడీ వెంకటనాయుడు యోగా ముఖ్య ఉద్దేశాలను వివరించారు. బుధవారం పార్వతీపురంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు మండల స్థాయిలో విజేతగా నిలిచిన బృందం పాల్గొననుందని తెలిపారు.

అధ్వానంగా మరుగుదొడ్లు

బొండపల్లి మండలంలోని ఒంపల్లి గ్రామంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు ఏళ్లుగా నిరుపయోగంగా వదిలేశారు. దీంతో గ్రామస్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. ఇక్కడ నీటి సౌకర్యం లేక వదిలేసినట్లు పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం అధ్వానంగా మారి చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. దీనిపై ఎంపీడీవో జి.గిరిబాల వద్ద ప్రస్తావించగా.. త్వరలో మరుగుదొడ్లు పరిశీలించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, బొండపల్లి



తాగునీటి వృథా



గుర్ల మండలం గుజ్జంగివలసలో తాగునీరు వృథాగా పోతోంది. స్థానిక చర్చి సమీపంలో కుళాయి వద్ద లీకవుతున్న నీరు విజయనగరం - పాలకొండ ప్రధాన రహదారిపై పారుతోంది. దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కార్యదర్శి విజయలక్ష్మి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. లీకులు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

ఎండుతున్న పంట..

రెండు వారాలుగా వర్షాలు లేకపోవడంతో గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో వరి పొలాలు ఎండుతున్నాయి. మరడాం, పాచలవలస, మరుపల్లి, పాత బగ్గాం, సాలిపేట గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఎండిపోవడంతో పాటు తెగుళ్ల బెడదతో నష్టాలు చవిచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏడీఏ కె.మహారాజన్ వద్ద ప్రస్తావించగా.. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో 2 శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయాలన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం



నూతన కార్యవర్గం ఎన్నిక



బొబ్బిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ ఉద్యోగుల జిల్లా అసోసియేషన్ ఎన్నికలు సోమవారం రాత్రి బొబ్బిలి ఐటీఐలో జరిగాయి. ఎన్నికల అధికారులు టి.దేముడు, కొట్ల శ్రీనులు మంగళవారం వివరాలు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా బి.అప్పలకొండ, ఉపాధ్యక్షులుగా కె.రామునాయుడు, డి.శేఖర్, కార్యదర్శిగా టి.వి.గిరి, సంయుక్త కార్యదర్శులుగా వి.శ్రీనివాసరావు, పి.వి.భాస్కరరావు, ఎ.రామునాయుడు, సభ్యులుగా కె.యుగంధర్, కె.రూప్సీరాణి, బి.ధనలక్ష్మి, ఎం.ఏస్సార్రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొబ్బిలి ఐటీఐ యూనిట్ అధ్యక్షుడిగా సీఎస్ రాజు తదితరులు ఎన్నికయ్యారు.

అంబరాన్నంటిన సంబరం



భావిరతమ్మ వనం వద్ద భక్తుల పూజలు

రాజాం, న్యూస్‌టుడే: రెండేళ్లకోసారి నిర్వహించే రాజాం గ్రామదేవత ఉత్సవాలు ఈ ఏడాది ఘనంగా జరిగాయి. నెల రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో చివరి రోజు మంగళవారం రాజాం పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బురదలపోలమ్మ పుటం తిరువీధి ఉత్సవం కుమ్మరవీధి నుంచి ప్రారంభమైంది. ఎక్కడికక్కడ భక్తులు బారులుతీరారు. దర్శనాలు సజావుగా జరిగేలా సీఐ కె.అశోక్‌కుమార్ ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయానికి వనం వద్ద అనుపోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వేడుకలో పాల్గొన్నారు.



బురదలపోలమ్మ తిరువీధి ఉత్సవంలో జనం రద్దీ

విద్యార్థులకు టీసీల అందజేత

బొబ్బిలి, న్యూస్‌టుడే: పాత బొబ్బిలికి చెందిన పలువురు సీపీఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు సునేత్రి మంగళవారం టీసీలు అందజేశారు. పాఠశాలకు గుర్తింపు లేకపోవడంతో పిల్లల చదువు నష్టపోయే ప్రమాదముందని, అందుకే టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాలను తరలిస్తే ఊరుకోమని గాంధీ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు.



టీసీలు చూపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కలాం జీవితం స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న నాయుడువలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

చీపురుపల్లి, వంగర, రాజాం, రామభద్రపురం, బొబ్బిలి, న్యూస్‌టుడే: అబ్దుల్ కలాం జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షుడు ఆర్.రమణ అన్నారు. జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో కలాం జయంతి, ప్రపంచ విద్యార్థుల దినోత్సవం నిర్వహించారు. ● అబ్దుల్ కలాం ఆదర్శనీయుడని వంగర మండల విద్యాశాఖాధికారి దుర్గారావు అన్నారు. ● కలాం దేశానికి చేసిన సేవలు నిరుపమానమని రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. రాజాం జ్ఞానజ్యోతి విద్యాలయంలో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ● బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబినాయన కలాం చిత్రపటానికి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

వీర్వోల సంఘం ఎన్నిక

సంతకవిటి: మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా మండవకురిటి వీఆర్వో అచ్యుతరావు, ఉపాధ్యక్షుడిగా రాజమోహన్, కార్యదర్శులుగా నీలయ్య, ఎన్.ఆదినారాయణ, కోశాధికారిగా పట్టాభి ఎన్నికైనట్లు వారు తెలిపారు.

క్రీడాకారుడికి అభినందన

బొబ్బిలి: ఇటీవల 1500 మీటర్ల పరుగుపందెంలో జాతీయస్థాయిలో సత్తాచాటిన రామభద్రపురం మండలం ముచ్చెర్లవలసకు చెందిన ఎస్.అశోక్‌ను జనసేన నాయకులు పి.బాబు, చీమల సతీష్ తదితరులు అభినందించారు.

మూడిళ్లలో చోరీ

గజపతినగరం: దావాలపేట పంచాయతీ కేతలనగర్ కాలనీలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మూడు ఇళ్లలో తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడ్డారు. దొంగతనాలు గుర్తించిన ఇళ్లను పరిశీలించి దొంగలను పట్టుకుంటామని ఎస్సై లక్ష్మణరావు అన్నారు.

నిబంధనలు పాటించాలి

సంతకవిటి: ప్రభుత్వ వేలంపాటలో దక్కించుకున్న మద్యం దుకాణాలను గుడి, బడి తదితర వాటికి దూరంగా పెట్టాలని రాజాం ఎక్సైజ్ సీఐ జైభీమ్ అన్నారు. సంతకవిటిలో ఆయన మాట్లాడుతూ.. దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.

రైతులకు సూచనలు

రామభద్రపురం, బాడంగి: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధ్యమని బాడంగి, రామభద్రపురం ఏవోలు శిరీష, వెంకటయ్య అన్నారు. బాడంగి, డొంకినవలస, రామభద్రపురం గ్రామాల్లో రైతులకు సూచనలు చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

రేగిడి, బొండపల్లి, వంగర, బొబ్బిలి గ్రామీణం, సంతకవిటి, న్యూస్‌టుడే: అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రేగిడి, ఆమదాలవలస, చినశిర్లాం, పెదశిర్లాం తదితర గ్రామాల్లో మంగళవారం రూ.15 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. ●బొండపల్లి మండలం బోరసింగిపేట గ్రామంలో సుమారు రూ.50 లక్షలతో రహదారి పనులకు శంకుస్థాపన పూజలు చేశారు. ● వంగర మండలం కొప్పరవలస, కొప్పర, కొండచాకరాపల్లి, ఓనిఅగ్రహారం గ్రామాల్లో తెదేపా మండలాధ్యక్షుడు పిన్నింటి మోహన్, సీనియర్ నాయకుడు ఎల్.కృష్ణమూర్తి తదితరులు శంకుస్థాపనలు చేశారు. ● జె.రంగరాయపురం, కోమటిపల్లి, నారాయణప్పవలస, శివడవలస, రాముడువలస గ్రామాల్లోని కార్యక్రమాల్లో ఎంపీడీవో రవికుమార్, ఏవో అప్పారావు, ఏఈ రాజశేఖర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ● సంతకవిటి మండలం బిల్లాణి పంచాయతీలో పల్లెపండగ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, కూటమి నేతలు కొల్ల అప్పలనాయుడు, వి.గణేష్, గట్టిభాను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

కల్యాణ మండపం నిర్మించాలి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని జి.అగ్రహారంలో కల్యాణ మండపం నిర్మించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును తెదేపా మండలాధ్యక్షుడు రౌతు కామునాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.శ్రీనివాసరావు తదితరులు కోరారు. మేజర్ పంచాయతీలో పెద్ద ప్రాంతమైన జి.అగ్రహారంలో నివాస గృహాలు, వీధులు, రహదారులు ఇరుగ్గా ఉన్నాయని, శుభకార్యాలు చేసుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు ఆర్.నారాయణరావు, ఆర్.లక్ష్మణరావు, కె.కృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావుతో కూటమి నాయకులు

22న రైతు సదస్సు

రేగిడి, న్యూస్‌టుడే: బ్రిటిష్ హయాం నాటి సాగునీటి వనరులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, వర్షాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రైతులకు తప్పడం లేదని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు అన్నారు. ఈనెల 22న అనకాపల్లిలో జరగనున్న ఉత్తరాంధ్ర రైతు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం రేగిడిలో ఆవిష్కరించి మాట్లాడారు. తోటపల్లి పాతకాలువ ద్వారా వంగర మండలంలో 4 వేల ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందడంలేదని, సాయన్న కాలువ ఆధునికీకరణకు నోచుకోవడంలేదన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

తీరంలో అలజడి



ముక్కాంలో గృహాల చెంతకు చేరుతున్న అలలు

భోగాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ తీరప్రాంత మండలాల్లో ఉన్న మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మంగళవారం ఉదయం నుంచి అడపాదడపా జల్లులు పడుతున్నాయి. బోట్లు కెరటాల దాటికి దెబ్బతినకుండా వెనక్కి తీసుకురావాలని మత్స్యశాఖ డీడీ నిర్మలకుమారి ఆయా శాఖాధికారులను ఆదేశించారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

ఘనంగా పైడితల్లి జాతర



నెల్లిమర్ల, డెంకాడ, న్యూస్‌టుడే: మండలంలోని సారిపల్లిలో పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలతో పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద పూజారి కిలారి సతీష్ దర్శనాలు చేయించారు. ఏటా విజయనగరం పైడితల్లి సిరిమానోత్సవం రోజునే ఇక్కడ కూడా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ● డెంకాడ మండలంలోని కొండరాజుపేటలో దుర్గాలమ్మ తల్లి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచి సరగడ బంగారు రెడ్డి, కల్యాణి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గ్రామస్థులు ముగ్రాటలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పసుపు, కుంకుమ, చీరలతో మొక్కులు చెల్లించారు.

సేవలో తరించి.. పులకించి



విజయనగరానికి చెందిన వైద్య దంపతులు ఎం.వెంకటేశ్వర రావు, పద్మావతి ఆసుపత్రి ఆవరణంలో సిరిమానోత్సవంలో ప్లకార్డులు చూపిస్తూ ప్రచారం నిర్వహించారు. అవయవదానంతో ఎనిమిది ప్రాణాలు కాపాడవచ్చునని అవగాహన కల్పించారు.





పైడితల్లి సిరిమానోత్సవం విజయవంతంగా ముగిసింది. జిల్లా యంత్రాంగంతో పాటు విజయనగరం నగరపాలక సంస్థ పక్కా ఏర్పాట్లు చేయడంతో సజావుగా సిరిమాను ఊరేగింపు పూర్తయింది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు సేవలు అందించారు. - న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, కంటోన్మెంట్, రింగురోడ్డు, కోట



ఉత్సవాలు, జాతరను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ప్రజలను ఆకట్టుకుంది



పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమైన నగరపాలక సంస్థ సిబ్బంది



వెదురుబుట్టలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తుడు

కోటలో పులివేషాలు.. కర్రి సాము

సిరిమానోత్సవంలో భాగంగా కోటలో మంగళవారం రాత్రి మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పులివేషాలు, కర్రసాము ప్రదర్శనలు నిర్వహించారు. అశోక్ గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, అగ్నికులక్షత్రియ శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, సుధా గజపతిరాజు, ఊర్మిళ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల వేదిక..

ఉత్సవాలను తిలకించే వేదిక కోట మహారాజుల కోట ప్రధాన మైదాన. అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో చేరుకున్నారు. 3 గంటల సమయంలో బురుజుపైకి వెళ్లారు. ● డీసీసీబీ నుంచి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి తదితరులు దర్శించుకున్నారు.

అడుగడుగునా..

❖ ఇండియన్ రెడ్‌క్రాస్, హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు పలు చోట్ల ఉచితంగా మజ్జిగ, మంచినీటి సీసాలను పంపిణీ చేశారు. వైఎంసీఏ పత్తెమ్మ తల్లి కమిటీ నిర్వాహకులు పులిహోర, మజ్జిగ అందించారు. ❖ ఎన్‌సీసీ క్యాడెట్లు, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్, సత్య డిగ్రీ, పీజీ, మహారాజా, ఎస్.కె.డిగ్రీ కళాశాల విద్యార్థులు, రెండో ఆంధ్రా బెటాలియన్, ఉర్దూ నావల్ విభాగం సిబ్బంది దివ్యాంగులు, వృద్ధులను దర్శనానికి తీసుకెళ్లారు. ❖ డాబా గార్డెన్స్ రోడ్డులో పెంటపాటి లక్ష్మణస్వామి, లక్ష్మీతాయారు, వరుణ్‌బాబు, భవ్య, విష్ణుబాబు, నిఖిత ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. 12 రకాల ఆహార పదార్థాలను అందజేశారు. ❖ శ్రీసాయిరామ్ గ్రూప్ అధినేతలు కిశోర్, సత్యనారాయణ 150 కిలోల పులిహోర, 25 కిలోల చక్కెర పొంగలి, 30 నీళ్ల ప్యాకెట్ల బస్తాలు పంపిణీ చేశారు. ❖ శ్రీఅరబిందో సేవా సమితి రెండు రోజుల పాటు మూడు పూటలా భక్తులకు ఆహారం అందించింది. ❖ శ్రీసాయి సేవా సంఘం 60 కిలోల పులిహోర, మంచినీటి ప్యాకెట్ల బస్తాలు ఇచ్చింది.



భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న దాతలు

జిల్లాస్థాయి పరీక్షలో విద్యార్థినుల ప్రతిభ



గోవిజ్ఞాన పరీక్షలో విజేతలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్షల్లో శృంగవరపుకోట పట్టణానికి చెందిన సర్వేపల్లి పాఠశాల విద్యార్థినులు మొదటి మూడు బహుమతులు సాధించారని కరస్పాండెంటు సీహెచ్ సన్యాసిరావు తెలిపారు. జూనియర్ విభాగంలో మండవల్లి హేమాంజలి (ప్రథమ), సీనియర్ విభాగంలో పి.కావ్యశ్రీ (ద్వితీయ), డి.సాయిభార్గవి (తృతీయ) స్థానాలు సాధించారన్నారు. ● శృంగవరపుకోటలో కౌముది గ్లోబల్ పాఠశాల విద్యార్థి సలాది షణ్ముఖ సత్య మనోజ్ సత్యసాయి ట్రస్టు నిర్వహించే జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శాంతి మహంతి తెలిపారు.

అబ్దుల్ కలాం జయంతి

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బి.పి.ఎ.రాజు సారథ్యంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మై ఇండియా వీరగాథ ప్రాజెక్టులో భాగంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. దీనిలో ఎనిమిదో తరగతి విద్యార్థి నల్లబిల్లి అజయ్, పాటల పోటీలలో ఎం.హాసిని విజేతగా నిలిచింది. వీరికి బహుమతులు అందజేశారు.

రాజన్నకు అంతిమ వీడ్కోలు



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మాజీ ఎంపీపీ, తెదేపా సీనియర్ నాయకుడు పొలమరశెట్టి రాజన్న(76)కు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం అంతిమ వీడ్కోలు పలికారు. ఆయన సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులు, పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు, వైజాగ్), తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జీ, గొరపల్లి రాము, కనకాల శివ, జనసేన నాయకుడు గొరపల్లి రవికుమార్, వైకాపా నాయకులు నెక్కల నాయుడుబాబు, గొరపల్లి జయప్రకాష్ నారాయణ, మేలాస్త్రి అప్పారావు తదితరులు నివాళులర్పించారు. రాజన్న పార్థివదేహంపై ఎమ్మెల్యే లలితకుమారి తెదేపా జెండాను కప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి ఓదార్చారు. జిందాల్ పరిశ్రమ డీజీఎం (పీఆర్) గోపాలకృష్ణ, కార్మికులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త రాజన్న మృతి కారణంగా పట్టణంలోని దుర్గాదేవి ఆలయాన్ని మూసివేశారు. పల్లె పండగ, ఉపాధి హామీ సామాజిక తనిఖీలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన వాయిదా వేశారు.

కూటమి ప్రభుత్వంలోనే పంచాయతీల ప్రగతి

డెంకాడ, వేపాడ, లక్కవరపుకోట, జామి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా డెంకాడ మండలం సింగవరం పంచాయతీ ఏటొడ్డు కల్లాలకు వెళ్లే బీటీ రహదారి, చొల్లంగిపేట పంచాయతీ పోతయ్యపాలెంలో సీసీ రహదారి నిర్మాణాలకు ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు కూటమి నాయకులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, తెదేపా, జనసేన నాయకులు పల్లె భాస్కరరావు, ఫణిరాజు, చింతపల్లి రామమూర్తి, సర్పంచి పిట్టా పద్మావతి, ఎంపీడీవో వై.భవాని పాల్గొన్నారు. ● పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం పేర్కొన్నారు. వేపాడ మండలంలోని పాటూరు, వీలుపర్తి పంచాయతీల్లో రూ.30 లక్షలతో సిమెంటు రహదారులు నిర్మించేందుకు భూమిపూజ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు ద్వారపూడి మంగమ్మ, తెదేపా, జనసేన నాయకులు కొట్యాడ రమణమూర్తి, పోతల వెంకటరమణ, సుంకరి అప్పారావు, వబ్బిన సత్యనారాయణ, ముమ్మన అప్పల ఈశ్వరరావు, ముచ్చకర్ల సూర్యం, ఉపాధి ఏపీవో ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● ఎల్.కోట మండలంలోని కళ్లేపల్లి, రేగ, నర్సంపేట, పోతంపేటల్లో ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఉపాధి ఏపీవో విజయలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారి వీరలక్ష్మి ఆధ్వర్యంలో పల్లె పండగ నిర్వహించారు. తెదేపా సీనియర్ నాయకుడు జక్కాన కన్నబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, సర్పంచులు పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ● జామి మండలంలో జామి, లక్ష్మీపురం, జడ్డేటివలస, రామభద్రపురం గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. జామి-దొండపర్తి వద్ద రూ.18 లక్షలతో నిర్మించనున్న రహదారికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, ఈవో రమణారావు, ఉపసర్పంచి అల్లు పద్మ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వర్రి రమణ, తెదేపా నాయకులు పి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పండగ'లో శంకుస్థాపనలు



బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు



పాటూరులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

విద్యార్థులు లేక వెలవెల



లక్కవరపుకోట, న్యూస్‌టుడే: లక్కవరపుకోట ప్రాథమిక పాఠశాల-2లో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మంగళవారం వారు పాఠశాలకు రాకపోవడంతో వెలవెలబోయింది. ఇక్కడకు గతంలో వచ్చే విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉండేది. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసేవారు. క్రమేపీ తగ్గుముఖం పట్టింది. ఉపాధ్యాయుడు అప్పలరాజు యథావిధిగా పాఠశాలకు వచ్చి సాయంత్రం వరకు ఉండి విద్యార్థులు ఎవరూ రాలేదని హాజరును అంతర్జాలంలో నమోదు చేసి వెళ్లారు. సోమవారం ఒక విద్యార్థి రాగా.. మంగళవారం ఎవరూ రాలేదని గ్రామంలోకి వెళ్లి చెప్పినా ఫలితం లేదని, తల్లిదండ్రులకు చైతన్యం కల్పిస్తామన్నారు.

రేషన్ బియ్యం ఎందుకు తగ్గించారు?

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: రేషన్ బియ్యం తగ్గించి ఇవ్వడంపై రంగాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.పద్మావతి, రంగాపురం, కూర్మవరం అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, సరస్వతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయిని టి.పద్మావతి మాట్లాడుతూ అక్టోబరులో 26 కిలోల బియ్యానికి 20 కిలోలు మాత్రమే ఇచ్చారన్నారు. రంగాపురం అంగన్‌వాడీ కేంద్రానికి 13 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. 10 కిలోలు ఇచ్చారని, కూర్మవరం అంగన్‌వాడీ కేంద్రానికి 12 కిలోలకు 10 కిలోలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సన్యాసిరావును వివరణ అడగ్గా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాస్‌లకు సమాచారం ఇవ్వగా తహసీల్దారు ప్రసాదరావుకు సమస్య వివరించారు.

గుచ్చుకుంటున్నా పట్టించుకోరా?

భోగాపురం మండలంలోని సుందరపేట సామాజిక ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు కినుకు వహిస్తున్నారు. రోగులకు వేస్తున్న పరుపులు చిరిగి గుచ్చుకుంటున్నా పట్టించుకోవడం లేదు. వీటిపై బెడ్‌షీట్లు వేస్తుండటంతో చిరుగులు బయటకు కనిపించకపోయినా.. పడుకునేటప్పుడు గుచ్చుకుంటున్నాయని రోగులు వాపోతున్నారు. బాగు లేని పరుపులను ఉపయోగించడం లేదని, విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని ఆసుపత్రి వైద్యాధికారి వెంకటేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.
– న్యూస్‌టుడే, భోగాపురం



సుందరపేట సామాజిక ఆసుపత్రిలోని పరుపుల దుస్థితి

భాజపా సభ్యత్వ నమోదు



దేవీగుడి కూడలిలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలో దేవీగుడి కూడలిలో భాజపా సభ్యత్వ నమోదు చేపట్టింది. పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు కూడలిలో కియోస్క్ ఏర్పాటు చేసి మోదీ నాయకత్వం పట్ల అభిమానం ఉన్నవారిని ప్రాథమిక సభ్యులుగా చేరుస్తున్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ మెరపుల నారాయణమూర్తి, సత్యనారాయణ, ఆటో కార్మికులు, వ్యాపారులు, రైతులు.. ఇలా 300 మంది సభ్యత్వం తీసుకున్నారని పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డి సూర్యారావు తెలిపారు. విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి, ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌ఛార్జి దానేష్, నాయకులు పాలకుర్తి అప్పారావు, కోన మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

డెంకాడ, న్యూస్‌టుడే: మండలంలోని గునుపూరుపేటలో దుర్గమ్మ, పైడితల్లి అమ్మవారి ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇటీవల గ్రామంలో దుర్గమ్మతల్లి పండగ జరగడంతో ఆ హుండీలో సుమారు రూ.15 వేల నగదు, పైడితల్లి ఆలయంలో రూ.2 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. డెంకాడ పోలీసులకు మంగళవారం ఉదయం ఫిర్యాదు చేసినట్లు ఆలయ అర్చకులు జాడ సన్యాసినారాయణ, గ్రామపెద్దలు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: బ్యాంకులో పని ఉందని తాతగారింటి నుంచి ఎస్.కోట వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో అదృశ్యం కేసు నమోదు చేశామని సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు. వేపాడ మండలం రామస్వామిపేటకు చెందిన పాతికేళ్ల యువతి సోమవారం ఉదయం తాతగారి ఊరు వీరనారాయణం వెళ్లింది. అక్కడి నుంచి ఎస్.కోటలో బ్యాంకు పని ఉందని చెప్పి తిరిగి ఇంటికి చేరలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ప్రసాద్ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

దూరంగా మద్యం దుకాణం పెట్టండి

నెల్లిమర్ల: మండలంలోని సతివాడలో ఉన్న మద్యం దుకాణాన్ని గ్రామానికి దూరంగా తరలించాలని స్థానిక మహిళలు డిమాండు చేశారు. స్థానిక రెల్లిపేట కాలనీకి ఆనుకొని ఉండడంతో మందుబాబులతో చాలా ఇబ్బందులు పడుతున్నామంటూ మంగళవారం మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా గ్రీవెన్స్‌లో రెండు సార్లు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు వివరించారు.

మన నేస్తం ఆర్థిక సాయం

వేపాడ: 'మన వేపాడ - మన నేస్తం' సభ్యులు గ్రామానికి చెందిన గుంపాన అప్పలనాయుడుకు రూ.5,000 ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేసినట్లు సభ్యులు గొర్లె రాంబాబు, శానాపతి దేముడు నాయుడు తెలిపారు.

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. పిల్లల నైపుణ్యాలను పరీక్షించారు.

18న పాడిరైతుల పోరుబాట

లక్కవరపుకోట: పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న పాల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని వ్య.కా.సం. జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, రైతు సంఘం నాయకుడు కృష్ణమూర్తి, అనుబంధ సంఘ నేతలు తెలిపారు 18న జామిలో నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలన్నారు.

నేడు మండల సమావేశం

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.వాసుదేవరావు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.భవాని తెలిపారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.